


# మహాబోధి

"పదండ్రా! యీ వొద్దు వోళ్ల పెండ్లాల తాడో, మన పెండ్లాల తాడో తెగిపోవాల. ఆ పాపిష్టి కొడుకుల తలకాయలు ఎగిరిపోవాల".

"తక్కువజాతి నా కొడుకులు. వోళ్లను యిడిసిపెట్టేదిలేదు. వొక్కొక్కడికి కాళ్లూ చేతులూ తుంచిపారెయ్యాల. పదండ్రా అందరూ."

"ఈ పొద్దు మన తడాఖా సూపించాల. ఈ వూళ్లో రాతిగోత్ర వోళ్లయినా పానాలతో మిగలాల. లేదా మట్టిగోత్ర వోళ్లయినా పానాలతో మిగలాల.

"మనముందు ఆ మద్దినాకొడుకు లెంత! ఏ తరంలోనైనా ఆ తక్కువ జాతి నాయాండ్లతో మనం కలిసినామా! సమ్మంధం కలుపుకొన్నామా!"

"అడక్కతినే యెదవలు మనకే ఎసురు పెడతారా! గంగమ్మ గుడికాడ దున్నపోతును బలిచ్చినట్టు వొక్కొక్కన్నే బలియ్యాల. పదండ్రా!

అందరూ అక్కడి నుండి కదిలారు. మనుషుల్ని సునాయాసంగా చంపెయ్యడానికి దమనకాండను జరపడానికి ఉపయోగపడే కర్రలూ, ఈటెలూ, గొడ్డళ్లూ, పదునైన కత్తులూ వాళ్ల చేతుల్లో వున్నాయి.

చెలియలి కట్టను ఛేదించడానికి తీవ్రంగా ప్రయత్నించే జలతరంగాల్లా.. ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో వాళ్ల ఎదలు ఎగిసి ఎగిసి పడుతున్నాయి. వాళ్లందరి ముఖాలు ఉద్రేకంతో జేవురించి వున్నాయి.

వాళ్ళందరిలోనూ ప్రతీకారమే జీవ నాడిగా పరిణమిస్తోంది. వాళ్ళ గుండెల్లో రోషాగ్నులు తీవ్రంగా రగులుతుంటు న్నాయి. వాళ్ళ నవనాడుల్లో ప్రవహిస్తున్న రక్తంలో కసి రంగరించుకుపోయింది.

బద్దలైన అగ్నిపర్వతపు లావాలా.. ఉవ్వెంగుతున్న కడలి కెరటాల్లా.... గండిపడిన తటాకపు జలప్రవాహంలా... ఉరవడిగా ఉధృతంగా ఉద్రేకంగా వాళ్ళంతా ముందుకు దూసుకు పోతున్నారు.

ఆ ఊరి పేరు రుద్రకోట. దేశ పటంలో కాదుగదా.... కనీసం జిల్లా పటంలోనైనా భూతద్దం పెట్టి వెదికినా ఆ పల్లెటూరి ఉనికి మనకు అగుపించదు. ఎన్నో పల్లెలకు దేశంలో గుర్తింపు లేనట్టే.... రుద్రకోటకు కూడా గుర్తింపు లేదు.

రుద్రకోటలో సుమారు వంద కాపురాలుంటాయి. అందరూ అగ్ర వర్ణాలకు సంబంధించిన వాళ్ళే. దేశపు దేహంపై మానని గాయంలా.... రుద్ర కోటకు తూర్పుదిశలో అరఫర్లాంగు దూరంలో ఓ పల్లె వుంది.

గాలికి కొట్టుకుని వచ్చిన ఎండు టాకులా వున్న ఆ పల్లెకు ఒక ప్రత్యేక మైన పేరంటూ లేదు. ఆ పల్లెలో నివసించేవాళ్ళు బోయవాళ్ళు. ఆ పల్లెలో సుమారు మువ్వయి కుటుంబాలుంటాయి.

బోయవాళ్ళు నివసించే పల్లె గనుక కొందరు దానిని 'బోయపల్లె' అంటారు. ఆ పల్లె రుద్రకోట గ్రామానికి సంబం ధించిన పల్లె గనుక.... దానిని మరి కొందరు 'రుద్రకోట బోయపల్లె' అని వ్యవహరిస్తుంటారు. బడుగు ప్రజల అభివృద్ధిలో పాలకవర్గాల యొక్క వైఫల్యాన్ని ప్రకటిస్తున్నట్టుగా వుంటుంది ఆ బోయపల్లె.

ఆ పల్లెలో నివసించే బోయవాళ్ళలో రెండు తెగలున్నాయి. మొదటిది 'రాతి గోత్రము' బోయతెగ. రెండవది 'మట్టి గోత్రపు' బోయతెగ. తెగలను అనుస రించి వాళ్ళకు వేర్వేరు కులవృత్తు లున్నాయి.

బండలను పగులగొట్టడం, భవనాల నిర్మాణాలకు అవసరమైన రాళ్ళను చీల్చి సరఫరా చెయ్యడం మొదలైన రాతి పనులకు సంబంధించిన వృత్తి రాతి గోత్రపు వాళ్ళది. వీరికి మట్టిపనులు తెలియవు.

గోడలు కట్టడం, బావులను త్రవ్వడం మొదలైన మట్టి పనులకు సంబంధించిన వృత్తి మట్టిగోత్రపు వాళ్ళది. ఈ మట్టి గోత్రపు బోయవాళ్ళకు రాతిగోత్రపు బోయవాళ్ళ వృత్తి పనులు తెలియవు.

పై రెండు తెగలకు సంబంధించిన బోయవాళ్ల మధ్య.... ఎలాంటి సంబంధ బాంధవ్యాలు ఉండవు. తమ తెగలకు సంబంధించిన శేశాలు మాత్రం వాళ్ల మధ్య కొంతవరకు శత్రుస్థాయిలో వుంటాయి.

మట్టి గోత్రపు తెగకన్నా తమ తెగే ఉత్తమమైందని రాతిగోత్రపు తెగవాళ్ల అభిప్రాయం. అలాగే రాతిగోత్రపు తెగకన్నా తమ తెగే ఉన్నతమయిన తెగ అని మట్టిగోత్రపు తెగవాళ్ల అభిప్రాయం.

కుల మత తెగలకు సంబంధించిన ఈ వైషమ్యం నేడు సర్వాంతర్యామి.

తెగలకి సంబంధించి అప్పుడప్పుడూ ఆ బోయపల్లెలో మారణహోమం జరుగుతుంటుంది. దానికి తోడు క్షుద్రకోట లోని కొందరు భూస్వాములు తమ ప్రయోజనాలకోసం ఆ తెగల మధ్య నిప్పురాజేస్తుంటారు.

తత్ఫలితంగా ఆ రెండు తెగలకు చెందిన బోయవాళ్లు.... పరస్పరం తలలు బద్దలు కొట్టుకుంటూ వుంటారు. నిప్పు రాజేసిన ఆ పెద్ద మనుషులే తర్వాత రంగప్రవేశం చేసి.... రాజీ తాత్కాలికంగా కుదుర్చుతుంటారు.

తమ వేళ్లతో తమ కళ్లే పొడిపిస్తున్నారని ఆ బడుగు ప్రజలు గ్రహించకుండా వుండేలా భూస్వాములు బహు జాగ్రత్తలు తీసుకుంటారు. ఎందుకంటే.. ఏ కాలంలోనైనా ప్రజలు ఎంత తెలివి తక్కువ దద్దమ్మలుగా వుంటే పాలక వర్గాలకంత ప్రయోజనం.

వేలిముద్రలు వేయగలిగిన వాళ్లు తప్ప తెలుగులో తప్పుగానైనా తమ పేర్లను వ్రాయగలిగినవాళ్లు ఆ బోయపల్లెలో మచ్చుకైనా కన్పించరు. వాళ్లను ఆ స్థాయికి పెత్తందార్లెప్పుడూ ఎదగనివ్వరు.

రాతిగోత్రపు బోయవాళ్ల నాయకుడు సదాశివుడు. ఆ తెగవాళ్లంతా సదాశివుడు గీసిన గీటును ఎప్పుడూ అధిగమించరు, సదాశివుడు ఏది చెబితే అది మిగిలిన వారందరికీ వేదవాక్కు.

మట్టిగోత్రపు బోయవాళ్ల నాయకుడు విశ్వనాథుడు. అతనికి పాతికేళ్లుంటాయి. బలిష్ఠమయిన శరీరం.... కోరమీసాలూ.. నల్లగా పోతపోసిన విగ్రహంలా వుంటాడు విశ్వనాథుడు.

ప్రస్తుతం విశ్వనాథుని తమ్ముడయిన జగన్నాథుడు సదాశివుడి చెల్లెలు జగదాంబను రాత్రి లేవదీసుకు పోయాడనే వార్త.... పొద్దు పొడవక ముందే రాతిగోత్రపు బోయల గుండెల్ని బాకులా పొడిచింది.



తెలుగు సినిమాలు చూడకపోయినా జగన్నాధుడూ జగదాంబ పరస్పరం యిష్టపడ్డారు. అయితే తెగలకు సంబంధించిన పుట్టింపులు వాళ్ళ ఇష్టాన్ని బలితీసుకుంటాయని వాళ్లకు ముందే తెలుసు అందుకే వాళ్లు రాత్రి ఈ సాహసం చేశారు.

ఈ సాహసంతో విశ్వనాథుడికిగాని...

మిగిలిన మట్టిగోత్రపు బోయవాళ్ళకు గానీ ఎలాంటి సంబంధమూ లేదు. అయితే యిదంతా విశ్వనాథుడి అండదండలతోనే జరిగిందని సదాశివుడి అనుమానం.

అందుకే యిప్పుడు సదాశివుడు తన తెగకు చెందిన మనుషుల్ని ప్రోగుచేసి.... మట్టిగోత్రపు తెగవాళ్ళమీదికి దండయాత్ర చేస్తున్నాడు. సదాశివుడి గుండె కుతకుత అవమానంతో ఉడికిపోతోంది.

"ఏమిట్రోయ్ సదాశివా! రాతిగోత్రపు వాళ్ళంతా కత్తులూ, కర్రలూ తీసుకు పోతున్నారు?"— తనకు ఏమీ తెలియనట్టు ముఖం పెట్టి అడిగాడు ఎదురుపడ్డ కరణం. కరణం ప్రక్కనే నారప్పనాయుడున్నాడు.

"ఏం చెప్పమంటారు సామీ! చెప్పాలంటే అనుమానంగా వుంది. ఆ మట్టిగోత్రపు మద్దినాకొడుకులు యింతపని చేస్తారని అనుకోలేదు"— అంటూ జరిగిన కథ వివరంగా చెప్పాడు సదాశివుడు.

"రామరామ! యిదేం పాపిష్టి పనిరా! ఎప్పుడైనా రాతిగోత్రంవాళ్ళకూ మట్టిగోత్రంవాళ్ళకూ పెండ్లి జరిగిందా! ఛా... మీ కులం పరువే గాదు ఈ వూరి పరువు కూడా పోయింది"— అంటూ సదాశివుడి ఆగ్రహానికి ఆజ్యంపోయసాగాడు నారప్పనాయుడు.

"భూమ్మీద ధూమకేతువులు పుట్టాయని, చంద్రుడే నిప్పులు కురిపిస్తాడని వీరబ్రహ్మంగారు చెప్పిన ఆ కలికాలం వచ్చేసింది. అందుకే మనుషులు యిలా నీతిమాలిన పనులు చేస్తున్నారు"— నీతిశాస్త్రాన్ని చదివినవాడిలా అన్నాడు కరణం.

"కులం, గోత్రం వదిలేసి, ఎంగిలీ మంగళం ఏకంచేసిన పాపిష్టినాకొడుకుల్ని మాత్రం ప్రాణాలతో వదలకూడదు. అయినా ఆ విశ్వనాథుడు మీ తెగ నింత భ్రష్టుపట్టిస్తాడని నే ననుకోలేదు"— ఉసిగొల్పసాగాడు నారప్పనాయుడు.

నారప్పనాయుడు చిన్నప్పుడు చిన్నయసూరిగారి మిత్రభేదాన్ని బాగా అధ్యయనం చేశాడు. అయితే అందులోని నీతికి బదులు ఆయన అందులోని జంబూక ప్రవృత్తిని మాత్రం ఒంటపట్టించుకున్నాడు

ఆయన రాజకీయజీవితం సర్పంచ్ స్థాయికి మించి ఎదగలేకపోయింది. గత సంవత్సరం విశ్వనాథుడూ అతని తెగవాళ్లు తన ప్రత్యర్థిఅయిన జయరామనాయుడికి మద్దతు యివ్వడం జరిగింది

ఫలితంగా గత ఎన్నికలలో నారప్పనాయుడి సర్పంచ్ పదవి కూడా జారిపోయింది. అప్పటినుంచి విశ్వనాథున్ని చూస్తే నారప్పనాయుడి గుండె కిరోసిన్ పోసిన పొయ్యిలా భగ్గున మండిపోతూ వుంటుంది.

అందుకే అవకాశం దొరికినప్పుడల్లా విశ్వనాథున్ని అతని తెగవాళ్ళనూ దెబ్బ

తీయడానికి నారప్పనాయుడు ప్రయత్ని స్తూనే వున్నాడు. అందుకే ఆయనిప్పుడు సదాశివుడిని బాగా రెచ్చగొట్టసాగాడు.

"సదాశివా! మీ గోత్రంముందు వాళ్ళ గోత్ర మెంత? తక్కువజాతి గోత్రం వాళ్ళకు మీతో వియ్యమొందగల అర్హత వుందా? బోయపల్లెలో విశ్వనాథుడేనా వీరుడు శూరుడు! మీరేం గాజులు తొడుక్కున్నారా?" — మరీ రెచ్చగొట్ట సాగాడు నారప్పనాయుడు.

"వోణ్ని పానాలతో యిడిసిపెట్టేది లేదు సావి. వోని పెల్లాం యీ పొద్దు ముండమొయ్యాల. వోవి మొగతనమెంతో .... వోడు ఏమాత్రం వీరుడో సూడాల. వోడి అతు సూసేదానికే పోతావుండాం సావి"— అన్నాడు సదాశివుడు రొప్పుతూ.

'శుభం' అంటూ మనసులోనే నారప్ప నాయుడు సదాశివున్ని ఆశీర్వదించాడు. తనను చులకనగా చూసిన ముఖ్యమంత్రిని పదవినుండి దించేసి ఆ పదవిని చేజిక్కించుకున్న ఎం.ఎల్.ఏలా అతను సంబరపడి పోయాడు.

కుడిచేత్తో కర్ర పట్టుకుని వేగంగా ముందు నడుస్తున్నాడు సదాశివుడు. మిగిలిన వాళ్ళందరూ అతనివెంట నడుస్తున్నారు. ప్రతీకారంతో వాళ్ళ నెత్తురు సలసల కాగిపోతోంది.

మట్టిగోత్రపు తెగకు సంబంధించిన బోయవాళ్ళ కాపురాలన్నీ ఊరికి పడమటి దిక్కులో వున్నాయి రాతిగోత్రపు బోయ వాళ్ళ కాపురాలు తూర్పుదిక్కులో వున్నాయి. అయిదు నిమిషాల్లో వాళ్ళందరూ తూర్పు దిక్కునుండి పడమటి దిక్కుకు చేరుకున్నారు.

ముందు నడుస్తున్న సదాశివుడు చటుక్కున ఆగిపోయాడు. అతడు ఉన్నట్టుండి అలా ఎందుకు ఆగిపోయాడో మిగిలినవాళ్ళెవరికీ అర్థం కాలేదు. అందరూ అతనివేపు ప్రశ్నార్థకంగా చూశారు.

సదాశివుడి చూపులు మాత్రం కొంత దూరంలో ఉన్న ఒక మేకమీద కేంద్రీకృతమై పోయాయి. అతడు కళ్ళు ఆర్పడంలేదు.

అక్కడ.... దూరంగా.... ఓ రాతి బండవద్ద ఓ మేక నిలబడివుంది. ఆ మేక పొదుగును చప్పరిస్తూ ఒక మేకపిల్ల మరో గొర్రెపిల్ల పాలుత్రాగుతున్నాయి. తన జాతిగాని, తన సంతతిగాని ఆ గొర్రెపిల్ల తన రొమ్మును చప్పరిస్తుంటే ఆ మేక కదలకుండా నిలబడి వుంది.

ఆ దృశ్యాన్ని సదాశివుడు కన్నార్పకుండా చూస్తూనేవున్నాడు. ఆ మేక.... కేవలం.... నోరులేని ఒక జంతువు. అది.... జాతి తెగల భేదాలను వదిలేసి... తన జాతికాని మరో జాతి పిల్లకు పాలు యిస్తోంది. నోరున్న తెలివున్న మనుషులు మాత్రం....

సదాశివుడి ఆవేశం, ఆగ్రహం, కసి ఆ క్షణంలో నీటిలోపడ్డ అగ్ని కణాల్లా ఆరిపోయాయి. అతనికి జ్ఞానోదయం కలిగినట్లయింది ఆ జంతువు అతనిపాలిట ఒక మహాబోధి. "వారేయ్! మనకన్నా జంతువులు మేలు. వెనుతిరగండి" అని సదాశివుడు అంటుంటే అందరూ విస్మయంగా చూశారతన్ని. •